
సాక్షి గుంటూరు

శనివారం : 7 : డిసెంబర్ : 2024



పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: బాల్యవివాహాల నిర్మూలన కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 585.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వెండి బహూకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం పెరుమాళ్ల రాజేష్, లక్ష్మీ వనజ దంపతులు 15 కేజీల వెండిని అందించారు.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తెనాలి రూరల్: మండలంలోని పెదారావూరు గ్రామంలోని శ్రీ అభయ హస్త సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ ఉటుకూరు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ నిర్వాహకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతలపాటి పూర్ణానంద శాస్త్రిని న్యాయమూర్తి, దేవస్థాన నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీసుబ్రహ్మణ్య వాక్యార్థ సభ నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు చండీ హోమం, సువాసినీ పూజ చేపట్టారు.

శివాలయంలో హుండీ కానుకలు లెక్కింపు



పెదకాకాని: మల్లేశ్వరస్వామి ఆలయానికి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా పాత గుంటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎస్ఎల్‌టీ సౌమ్య విచ్చేశారు. కళ్యాణమండపంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. 46 రోజులకు గాను రూ.56,14,083 వచ్చాయి. అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా రూ.3,36,386 సమకూరింది. బంగారం 30.90 గ్రాములు, వెండి 259 గ్రాములు, విదేశీ కరెన్సీ 55 డాలర్లు వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కెనరాబ్యాంకు మేనేజరు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. పెదకాకాని పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు పర్యవేక్షించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



బల్లికురవ: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా తన పని తాను చేసుకుంటున్న కొయ్యలమూడి మరియమ్మ (110) శుక్రవారం మృతి చెందింది. ఈమె భర్త ఏసోబు (110) పదేళ్ల కిందట మంచం పట్టకుండానే ముందు రోజు వరకు తిరుగుతూ హఠాత్తుగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొప్పరపాలెం గ్రామానికి చెందిన కొయ్యలమూడి మరియమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలతో కలిసి సుమారు 60 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇటీవలే అందరూ కలిసి వేడుక జరిపారు. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య సాయంత్రం మరియమ్మ అంత్యక్రియలు ముగించారు.

9న బీటెక్, బీఎస్సీ కోర్సులకు కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ఈ నెల 6వ తేదీన మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తయి మిగిలిన సీట్ల భర్తీకి మరలా ఈ నెల 9వ తేదీన స్పాట్ రిజిస్ట్రేషన్, స్పాట్ మాన్యువల్ కౌన్సిలింగ్‌ను ఉదయం 9.30 గంటలకు నగర శివారు లాంఫాం నందున్న వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ పొందిన ప్రతి విద్యార్థి హాజరవ్వవచ్చని పేర్కొన్నారు. ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ సైట్‌లో సంప్రదించాలన్నారు.

పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన పల్నాడు ఎస్పీ



అచ్చంపేట: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టును పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. భద్రతా చర్యలు పర్యవేక్షించారు. ఇంజనీర్ల నుంచి వివరాలు సేకరించారు. రెండు రోజుల కిందట ఆక్టోపస్ టీమ్ ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించింది. తీవ్రవాదుల నుంచి ప్రాజెక్టు , ప్రభుత్వ ఆస్తుల రక్షణపై శిక్షణ ఇచ్చారు.

ఆంక్షలు.. అడ్డంకులు..!

తాడికొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పర్యటనపై కూటమి కక్ష

తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించగా.. పోలీసులు అడ్డగోలు ఆంక్షలు విధించారు. ముందుగానే నిర్ణయించిన టీటీడీ ఆలయ సందర్శన, ప్రత్యేక పూజల కార్యక్రమానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. కూటమి సర్కారు కక్ష సాధింపునకు ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది.

- దైవ దర్శనానికి వెళ్తుండగా డైమండ్ బాబును అడ్డుకున్న పోలీసులు
- ఆంక్షల పేరుతో కొందరి అత్యుత్సాహం
- వందలాది మందితో వాహనాలు తనిఖీ
- లెక్క చేయక భారీగా హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు
- పార్టీలకతీతంగా ప్రజా సమస్యలపైనే పోరాటం: వనమా బాల వజ్రబాబు
- కక్ష సాధింపు చర్యలు సహించేది లేదని హెచ్చరిక
- పోలీసులు తీరు మార్చుకోవాలని సూచన



లాంలో పార్టీ కార్యకర్తలు, వనమా బాల వజ్రబాబును అడ్డుకుంటున్న పోలీసులు

తాడికొండ: గుంటూరు నుంచి భారీ వాహనాలతో ర్యాలీగా బయలు దేరిన తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు తొలుత లాం గ్రామానికి చేరుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ తాడికొండ సీఐ కె. వాసు ఆధ్వర్యంలో పోలీసులు అనుమతులు లేవంటూ పర్యటనను అడ్డుకున్నారు. దైవ దర్శనానికి వెళుతుంటే అడ్డుకోవడం మంచిది కాదని వనమా బాల వజ్రబాబు ప్రశ్నించినప్పటికీ అనుమతుల పేరుతో నిలిపివేయడంతో సహనంతో వ్యవహరించారు. అనంతరం ఆయన 4 కార్లకు అనుమతి తీసుకొని బయలుదేరారు. తాడికొండ బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్కాట్స్ భవనం వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం, పెదపరిమి బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటపాలెంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైమండ్ బాబు మాట్లాడుతూ... దైవ దర్శనానికి వస్తే ఇలా చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తామెప్పుడూ ప్రతిపక్షంపై ఆంక్షలు విధించలేదన్నారు. న్యాయబద్ధమైన ప్రజా సమస్యలపైనే తమ పోరాటమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 4 మండలాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులు...

తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తుళ్ళూరు, రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌ల వద్ద వందలాది మంది పోలీసులను మోహరింపజేశారు. తనిఖీల పేరుతో వాహనాల రాకపోకలపై నిషేధం విధించడంపై సామాన్యులు సైతం అసహనానికి లోనయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమం కానప్పటికీ ఇలా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించడంతో పోలీసులు సమాధానం చెప్పేందుకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కార్యకర్తలు, నాయకులు వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ఇతర మార్గాల్లో టీటీడీ ఆలయానికి చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మనిషిని ప్రేమించేలా రాజ్యాంగం రాసిన అంబేడ్కర్

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డాక్టర్ కత్తి పద్మారావు



డాక్టర్ పద్మారావు రచనను ఆవిష్కరించిన పిల్లి విద్యాసాగర్

తెనాలి: దళితులకు మాట్లాడే స్వేచ్ఛ, సమానత్వం సహా మనిషిని మనిషిగా ప్రేమించే రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని దళిత ఉద్యమ నిర్మాత, ప్రసిద్ధ కవి, రచయిత డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. దళితులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అంబేడ్కర్ చాటారని తెలిపారు. పట్టణ చినరావూరుతోటలోని మదర్ థెరిస్సా నగర్‌లో అంబేడ్కర్ యూత్, విగ్రహ నిర్మాణ కమిటీ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాత్రి డాక్టర్ కత్తి పద్మారావు ఆవిష్కరించారు. అనంతర సభకు కనపర్తి అబ్రహం లింకన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పద్మారావు రచించిన 91వ పుస్తకం 'మన దేశం- మన రాజ్యాంగం' పుస్తకాన్ని పిల్లి విద్యాసాగర్, 'భారతదేశ చరిత్ర'ను మండే నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సభలో డాక్టర్ పద్మారావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్నుమూశాక 68 ఏళ్లకు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. శూద్రులు సహా అణగారిన వర్గాల వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు అంబేడ్కర్ శపథం చేసి మరీ సాధించారని అన్నారు. ఆయన ప్రసాదించిన రాజ్యాంగంతో నేడెందరో సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. స్వేచ్ఛ, స్వాతంత్య్రం, సమానత్వం వంటి హక్కులను ప్రసాదించినట్టు చెప్పారు. అంబేడ్కర్ మార్గదర్శకత్వంలో కారంచేడు, చుండూరు ఉద్యమాలతో ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని తీసుకురాగలిగినట్టు చెప్పారు. ఆయన ప్రసాదించిన కలం, పుస్తకం ఆయుధంగా ఈ రోజున సివిల్స్‌కు సిద్ధమవుతున్న వారిలో 65 శాతానికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉండటం చారిత్రక మార్పుగా చెప్పారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.

'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదు ప్రదానం

సభలో డాక్టర్ కత్తి పద్మారావును సత్కరించి 'అంబేడ్కర్ సూర్యుడు' బిరుదును ప్రదానం చేశారు. తొలుత స్థానిక జేఎంజే మహిళా కాలేజీ నుంచి భారీ బైక్ ర్యాలీతో డాక్టర్ పద్మారావును సభాస్థలికి తోడ్కొని వచ్చారు. మన్నవ ప్రభాకర్ స్వాగతం పలికారు. వాసిమళ్ల శ్యామ్ సభాపరిచయం చేశారు. మన్నవ శాంతిశ్రీ, దాసరి వీరవసంతరావు, అక్కిదాసు కిరణ్, కంచర్ల ఆనంద్, కారుమంచి రవికుమార్, బేతాళ ప్రభాకర్, పిల్లి గంగాధర్, బేతాళ భూషణం, కనపర్తి అనిల్, మేకతోటి ప్రభాకరరావు, కన్నెగంటి రమేష్‌బాబు, బోరుగడ్డ సురేష్, పీసీహెచ్ వెంకయ్య, గొల్లా మాణిక్యరావు, గారపాటి బాలస్వామి, కర్రా రాజారత్నం, మేరుగ సంజీవరావు, నీలా విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా పాల్గొని, అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- నంబూరు సదస్సులో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి

పెదకాకాని: భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ, సీసీఎల్‌ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సదస్సులో వ్యవసాయ, నివాస స్థలాలపై రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు, నిషేధిత భూములు జాబితా, మ్యుటేషన్, అడంగల్ , సర్వే , భూ రికార్డులలో సవరణలకు సంబంధించి అర్జీలను స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రికార్డుల పరిశీలన

గ్రామానికి సంబంధించిన అన్ని భూ రికార్డులు ప్రదర్శిస్తామని, ప్రజలు వాటిని తనిఖీ చేసుకొని వారికి సంబంధించిన భూముల రికార్డులలో సవరణలు ఉంటే అర్జీ ఇవ్వాలన్నారు. రెవెన్యూ శాఖతో పాటు రిజిస్ట్రేషన్, దేవదాయ, వక్ఫ్ బోర్డుల ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారన్నారు. నివాస స్థలానికి సంబంధించి భూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధన ప్రకారం రెగ్యులైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమావేశ భవన నిర్మాణం కోసం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై నివేదిక అందించాలన్నారు. జిల్లాలోని 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ గ్రామాల్లో స్థానిక ప్రచార మాధ్యమాల ద్వారా, సచివాలయ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులోను విస్తృతంగా ప్రచారం కల్పించడం జరుగుతుందన్నారు. సదస్సులు జరిగే తేదీకి రెండు రోజులు ముందు నుంచే గ్రామంలో టాంటాం వంటి ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరికి తెలియచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రెవెన్యూ సదస్సులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వారికి సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సదస్సులో గ్రామ మ్యాపు, అర్జీలు ఆన్లైన్ నమోదు, గ్రామ రికార్డులను పరిశీలించారు. ప్రజలు అందించిన అర్జీల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. గ్రామ రికార్డులోని ఆర్ఎస్ఆర్‌లో ప్రామాణికంగా తీసుకొని అడంగల్ 1బీ, ఇతర రికార్డుల్లో భూ యజమానుల వివరాలను పరిశీలించాలన్నారు. తేడాలు గుర్తిస్తే అధికారులు సుమోటోగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రికార్డుల్లో సవరణలు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాల్సిన అంశాలకు సంబంధించి భూ యజమానులతో అర్జీలు తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సదస్సుల మండల స్థాయి ప్రత్యేక అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా మేనేజర్ లక్ష్మీకుమారి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, పెదకాకాని తహసీల్దార్ కృష్ణ కాంత్, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు వేదికగా టెక్ ఫెస్ట్



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ వివరాలు తెలుసుకుంటున్న స్వప్నిల్ పవర్ జగన్నాథ్

గుంటూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్ ఫెస్ట్- 2024ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని సమాజాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని తెలిపారు. కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన 113 వినూత్న ఆవిష్కరణల స్టాల్స్‌ను సందర్శించి, వాటి గురించి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పాటు చేసిన 113 ఆవిష్కరణలను ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు 1,350 మంది సందర్శించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దళిత వ్యతిరేక పాలన

- బీఆర్ అంబేడ్కర్ భావజాలానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం తీరు
- నారా లోకేష్ నాయకత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

నెహ్రూనగర్: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మరీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళిత వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, అణగారిన వర్గాలు ఎదగాలంటే రిజర్వేషన్లు కావాలని అమలు చేశారని గుర్తు చేశారు. ఆ ఫలితంగానే నేడు పలువురు ఉన్నతస్థాయికి ఎదిగారని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలను వైఎస్సార్‌సీపీ ముందుకు తీసుకువెళ్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అత్యంత ఘనంగా విజయవాడ నడిబొడున అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే కూటమి ప్రభుత్వం కించపరిచేలా పాలిస్తోందని మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో ప్రజలంతా ఈ రాజ్యాంగానికి చరమగీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

నేతల కీలక ప్రసంగాలు...

- పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మకమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తుందన్నారు.
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రతిష్టాత్మకమైన రాజ్యాంగాన్ని మన దేశానికి అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడు అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయం అన్నారు. ఆయన అందించిన రిజర్వేషన్ల ఫలితంగానే నేడు రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్నట్లు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు నిమ్మకాయల రాజనారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బత్తుల దేవానంద్, మండేపూడి పురుషోత్తం, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, అగ్గిపెట్టి రాజు, పూనూరి నాగేశ్వరరావు, దూపాటి సాల్మన్, సున్నం మల్లికార్జునరావు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణ (ఆచారి) తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ల సమావేశం ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: ఈ నెల 10, 11వ తేదీలలో రాష్ట్ర సచివాలయం బ్లాక్–5లో జరగనున్న కలెక్టర్‌ల సమావేశానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులతో కలిసి పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సెక్యూరిటీ, భోజన ఏర్పాట్లపై తగు సూచనలు జారీ చేశారు. సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. రెండు రోజుల పాటు జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశానికి సంబంధించిన డ్యూటీలు కేటాయించిన అధికారులు సమన్వయంతో సమర్థంగా విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె. శ్రీనివాసరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహనరావు, డీఎస్‌వో కోమలి పద్మ, సీసీఓ శేషశ్రీ , జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఐవో బిమల్ కుమార్, తుళ్ళూరు తహసీల్దార్ సుజాత, సచివాలయ ప్రొటోకాల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లపై జేసీ ఆగ్రహం

- కౌలు రుణాలు లక్ష్యం రూ.180 కోట్లు
- ఇప్పటివరకు ఇచ్చింది రూ.36.8 కోట్లే
- 15 రోజుల్లో లక్ష్యాలు పూర్తిస్థాయిలో అధిగమించాలని ఆదేశం

గుంటూరు వెస్ట్: బ్యాంకర్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో అధికారులను, బ్యాంకు మేనేజర్లను నిలదీశారు. కౌలు రుణ లక్ష్యం రూ.180 కోట్లు కాగా.. త్రైమాసికం ముగిసే నాటికి రూ.36.8 కోట్లు ఇచ్చామని బ్యాంకర్లు చెప్పడంతో జేసీ మండిపడ్డారు. ప్రభుత్వం కౌలు రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాన్ని సైతం తీసుకొస్తున్న తరుణంలో బ్యాంకర్లు కనీసం రుణాలిచ్చి సహకరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన గృహ రుణాల లక్ష్యం రూ.664 కోట్లు కాగా... ఇప్పటి వరకు రూ.113.5 కోట్లు ఇచ్చారన్నారు. దీనిపై జేసీ ప్రశ్నించారు. తొలి త్రైమాసిక లక్ష్యాలు 15 రోజుల్లోనే పూర్తి చేయాలన్నారు. రుణాలు పొందే రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వర్తించేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రుణాలు వారం రోజుల్లోనే మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజనల్ డీజీఎం జవహర్, ఆర్బీఐ ఎల్‌డీఎం నవీన్, నాబార్డ్ డీఎం ఎం.శరత్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,600** గరిష్ఠం : రూ. **3,400**

మోడల్ ధర రూ. **3,000**

క్లుప్తంగా

రూ. 3.5 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం



మంగళగిరి: తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితుల నుంచి రూ.3.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సినీ ఫక్కీలో పేపర్ బండిల్స్‌లో దుంగలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. 49 దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ రవి కుమార్, డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ వై శ్రీనివాసరావు , పట్టణ సీఐ డి వినోద్‌కుమార్, రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ పాల్గొన్నారు.

యార్డులో 42,686 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 38,221 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 42,686 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 33,656 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

విదర్భ జట్టు 203 పరుగులకు ఆలౌట్

మంగళగిరి: నగర పరిధిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీలో కర్ణాటకతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు 77.05 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టు వికెట్ కోల్పోయి 31 పరుగులు చేసింది. విదర్భ బ్యాట్స్‌మెన్ కెష్ శర్మ 49, సాయి 49 పరుగులు చేశారు.

ప్రజా రక్షణలో హోంగార్డులు కీలక పాత్ర



ప్రశంసా పత్రం అందిస్తున్న దృశ్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ప్రజా రక్షణ కోసం హోంగార్డులు నిరంతరం అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కవాతు మైదానంలో శుక్రవారం 62వ హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవాలు నిర్వహించారు. హోంగార్డుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోంగార్డుల సేవలు మరువలేమని అన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో హోంగార్డుల పాత్ర కీలకమని చెప్పారు. చైనాతో యుద్ధం సమయంలో భారత సైన్యానికి హోంగార్డులు అత్యుత్తమ సేవలు అందించారని చెప్పారు. అప్పటి నుంచి పోలీస్ శాఖకు సహాయకులుగా నియమించారని తెలిపారు. ఇటీవల హోంగార్డులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన 12 మందికి అవార్డులు, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఆరుగురికి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ అందించారు. తొలుత జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, డీఎస్పీ (ఏఆర్) ఏడుకొండలరెడ్డి, హోంగార్డు ఆర్ఐ శివరామకృష్ణ, హోంగార్డు ఎండీ సందాని పరేడ్ కమాండర్‌గా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ దీక్ష, డీఎస్పీలు మల్లికార్జునరావు, జయరాం ప్రసాద్, అజీజ్, సుబ్బారావు, సీఐలు శ్రీనివాసరావు, వీరనాయక్, వీరేంద్రబాబు, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, ఉదయభాస్కర్, శివరామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ. భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: రాజ్యాంగాన్ని రచించడంలో కీలక భూమిక పోషించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నో కష్టనష్టాలను అధిగమించి అంబేడ్కర్ ఎదిగిన తీరు యువతకు ఆదర్శనీయం అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎం కార్యాలయంలో...



పుష్పాంజలి ఘటిస్తున్న గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్.రామకృష్ణ

లక్ష్మీపురం: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఏటా డిసెంబర్ 6న మహాపరినిర్వాణ్ దివస్‌ను నిర్వహిస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం ఆర్.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సామాజిక న్యాయాన్ని, మానవ హక్కులను ప్రోత్సహించడానికి అంబేడ్కర్ చేసిన కృషిని గుర్తుంచుకోవాలన్నారు. ఏడీఆర్ఎం. సైమాన్, అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పని తీరు బాగు



డాక్టర్ మానస తదితరులతో విజయభారతి

తాడేపల్లి రూరల్: ప్రకాష్‌నగర్ అంబేడ్కర్ నగర్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిర్మించిన ఈ హెల్త్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అనారోగ్య సమస్యలతో వచ్చిన వారిని అడిగి వైద్యసేవలు అందుతున్న తీరు తెలుసుకున్నారు. ఆపై సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ మానసను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అదనపు డైరెక్టర్ శ్రీసంతోష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస మంజరి, డాక్టర్ శ్రీధర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రామోజీ నాయక్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఉన్న ఇంటర్నేషనల్ స్పా సెంటర్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అడిషనల్ ఎస్పీ సుప్రజ, అరండల్ పేట సీఐ వీరాస్వామి ప్రత్యేక బృందాలుగా శుక్రవారం దాడులు నిర్వహించారు. నలుగురు థాయిలాండ్‌కు చెందిన వారితో పాటు ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జరగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న పరీక్షకు గుంటూరులో ఆరు, తెనాలిలో ఐదు చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,056 మంది హాజరు కానున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో తన కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

రోగి సంతృప్తే ప్రధానం



మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: అత్యంత ప్రాచుర్యం పొందిన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స అనంతరం రోగి సంతృప్తికరంగా ఉండడం అనేది వైద్యుడి ప్రధాన కర్తవ్యం అని ప్రముఖ కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అన్నారు. మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సమయంలో ఆపరేషన్ తరువాత రోగి అస్థిరత్వానికి గురికాకూడదని తెలిపారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన 69 వ ఇండియన్ ఆర్థోపెడిక్ జాతీయ సదస్సు (ఐఓఏకాన్)లో ఇన్‌స్టెబిలిటీ ఆఫ్టర్ టీకేఆర్ అనే అంశంపై డాక్టర్ నరేంద్ర రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దేశ వ్యాప్తంగా ఆరువేల మందికిపైగా ఎముకలు, కీళ్ల వైద్య వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అతి కొద్దిమంది మాత్రం తరచూ కొన్ని సమస్యలను వ్యక్తపరుస్తున్నారని వెల్లడించారు. దీనిపై తన పరిశోధన, పరిశీలన సుదీర్ఘకాలం కొనసాగిందని చెప్పారు. మోకీలు మార్పిడిలో ఇంప్లాంట్‌ను అమర్చడం, అవసరం మేరకు ఎముకను కట్ చేయడం అనేది ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రోగి శరీరతత్వంపై కూడా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నరేంద్ర రెడ్డి వివరించారు.

రేపు ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నైట్ క్యాజిల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 6 నుంచి 16 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలకు ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పోటీల నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక జేసీ కాలేజ్ ఆఫ్ లా భవనంలో పోటీలు ఉంటాయని చెప్పారు. వివరాలకు 90631 42105 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

రేపు టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–15 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు నడింపల్లి వెంకట గురునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లను ఈ నెల 20 నుంచి కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 93985 06170 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



యడ్లపాడు: కళా ఉత్సవ్ 2024–25 జిల్లాస్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం ఆరు విభాగాల్లో ఏర్పాటు చేయగా వాటిలో మూడింటిలో మాత్రమే విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానంగా జానపద గీతాలాపన, సంప్రదాయ నృత్యం, మైమ్‌షో విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జానపదం విభాగంలో మున్నంగి జెడ్పీహైస్కూల్ బృందం, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందాయి. సంప్రదాయ నృత్య విభాగంలో వేల్పూరు జెడ్పీ హైస్కూల్, గుంటూరు వెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. మైమ్‌షోలో మాత్రం వేలూరు జెడ్పీ హైస్కూల్ ఒక్కటే ప్రథమ స్థానాన్ని గెలుచుకుంది. ఆయా పోటీలకు డైట్ లెక్చరర్ల్ కె. ప్రసాద్, కె. అజయ్‌కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు డైట్ కళాశాల సీనియర్ లెక్చరల్ ఎస్ఎం సుభాని బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా డీఈవో ఎల్. చంద్రకళ నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలందరికీ ఆమెతో పాటు అధ్యాపకులు అభినందించారు. బాలబాలికలు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించడం ప్రశంసనీయమన్నారు. ఆయా పోటీల్లోనూ అద్భుత కళా నైపుణ్యాలు ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీల్లో స్థానం సంపాదించి, జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎన్జీ రంగా వర్సిటీలో అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మీదేవి తదితరులు

గుంటూరు రూరల్: దేశం గర్వించేలా రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి తెలిపారు. నగర శివారు లాంఫాం నందున్న వర్సిటీ పరిపాలన భవనంలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి వీసీ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగంలో హక్కులతోపాటు బాధ్యతలను అందరూ గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బీ శ్రీలక్ష్మి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ డీ సంపత్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ పి.సాంబశివరావు, ఎస్టేట్ ఆఫీసర్ పీ రవి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న పాశం రామారావు

లక్ష్మీపురం: ఈ నెల 14, 15వ తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ.. మహాసభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు, డి.రమాదేవి, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పాల్గొంటారని చెప్పారు. 14న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో జరిగిన ప్రజా పోరాటాలను సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుంటామని వివరించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు నానాటికీ పెంచుతూ పోతున్నారని ఆరోపించారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరిగినట్లు ఆరోపించారు. జమిలీ ఎన్నికల పేరుతో రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని కూడగట్టి పోరాటాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్. భావన్నారాయణ, నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగులో ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం

- ప్రకృతి సాగు విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి
- నంగంగోపాలపురంలో ప్రకృతి పంటల పరిశీలన



సంగంగోపాలపురంలోని ప్రకృతి సాగుని పరిశీలిస్తున్న డీపీఎం కె.అమలకుమారి

యడ్లపాడు: సాగులో ఏటీఎం (ఎనీ టైం మనీ) విధానంతో రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె. అమలకుమారి చెప్పారు. యడ్లపాడు మండలాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంగంగోపాలపురంలోని రైతు రామకృష్ణ ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ పంటను పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. 40 సెంట్ల విస్తీర్ణంలో అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయ పంటల్ని సాగు చేయడాన్ని వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగం లేకుండా మంచి పోషకాల కలిగిన ఉత్పత్తుల్ని పండిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా వాటిని విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నట్లు తెలిపారు. ఈ విధానం సాగుతో అటు నేలకు, ఇటు వినియోగదారులకు అనారోగ్య సమస్యలు వాటిల్లవని వివరించారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 39,113 మంది రైతులు 42312 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఏ సైదయ్య, అప్పలరాజు, నందకుమార్, మేరి, సౌజన్య, మాస్టర్ ట్రైనర్లు జయలక్ష్మి, మధుబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు సన్నాహాలు

- కళాశాలల ప్రయోగశాలల్లో వసతుల పరిశీలన
- సిద్ధమవుతున్న 25 వేల మంది ఇంటర్ విద్యార్థులు
- ప్రయోగశాలల ఎంపిక అనంతరం ఫిబ్రవరిలో నిర్వహణ
- చదువుతున్న కళాశాలలోనే ప్రాక్టికల్స్‌కు అవకాశం



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్)ను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తున్న దృష్ట్యా, వాటి నిర్వహణకు అనువైన ప్రయోగ శాలలను ఎంపిక చేసే పనిలో ప్రస్తుతం అధికారులు నిమగ్నమయ్యారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు తత్కాల్‌తో కలిపి ఫీజు చెల్లించేందుకు ఇచ్చిన గడువు ముగియడంతో పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 163 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 65,029 మంది విద్యార్థులు శుక్రవారం తత్కాల్‌తో కలిపి తుది గడువు ముగిసే నాటికి పరీక్ష ఫీజు చెల్లించారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు 33,527 మంది, ఒకేషనల్‌లో 876 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సర ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు 29,875 మంది, ఒకేషనల్‌లో 751 మంది ఉన్నారు. సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులతో పాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్నారు. మొత్తం హాజరయ్యే విద్యార్థులు 25 వేల మంది వరకు ఉండే అవకాశముంది.

నాన్ జంబ్లింగ్ విధానంలో ..

నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. నిర్వహణకు అనువైన కేంద్రాల జాబితా పంపాల్సిందిగా ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలను పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పరికరాలు, రసాయనాలు అనువుగా ఉన్నవీ, లేనిదీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా పూర్తిస్థాయిలో వసతులు ఉన్న కళాశాలలనే ప్రాక్టికల్స్ నిర్వహణకు ఎంపిక చేస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ చెప్పారు. గతంలో ప్రాక్టికల్స్ నిర్వహణ సమయంలో జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలల్లో సరైన వసతులు లేని విషయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కళాశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి బోర్డు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలు, రసాయనాల లభ్యతను పరిశీలించిన తరువాతే ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

బిహార్‌కు చెందిన మహిళ

మేదరమెట్ల: బతుకుదెరువు కోసం వచ్చిన మహిళ కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల–అద్దంకి రోడ్డులోగల మసీదు సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సలీమా ఖాతుమ్ (28) తన భర్త వసీమ్‌తో కలసి పదేళ్లుగా మేదరమెట్లలో ఉంటున్నారు. భర్త గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ భర్త కొల్‌కత్తా వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఖాతూమ్ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు మేదరమెట్ల పోలీసులకు సమాచారం అందజేశారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి భర్తకు ఫోన్ సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం భర్తతో ఫోన్‌లో మాట్లాడిన తరువాతే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి నాలుగేళ్ల పాప ఉంది.